ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం 9
మే 2025





# నేటి నుంచి యాదగిరీశుడి జయంతి ఉత్సవాలు

**స్వస్తివాచనం, పుణ్యాహవచనంతో ఉత్సవాలను ఆరంభించనున్న అర్చకులు**

**జయంతి ఉత్సవాల సందర్భంగా 11 వరకు ఆర్జిత సేవలు బంద్**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట ఆలయంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు శుక్రవారం మొదలు కానున్నాయి. ఈ నెల 9 నుండి 11 వరకు మూడు రోజుల పాటు జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 8:45 గంటలకు, పాతగుట్ట ఆలయంలో కూడా ఉదయం 8:45 గంటలకు స్వస్తివాచనం, విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, కుంకుమార్చన, మృత్సంగ్రహణం, అంకురార్పణ, హవనంతో జయంతి ఉత్సవాలకు అర్చకులు శ్రీకారం చుట్టనున్నారు. జయంతి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో స్వామివారికి సంబంధించిన పలు రకాల అలంకార సేవలు నిర్వహించనున్నారు. యాదగిరిగుట్ట, పాతగుట్టతో పాటు అనుబంధ ఆలయమైన దబ్బగుంటపల్లిలోని యోగానంద నరసింహస్వామి టెంపుల్ లో కూడా జయంతి ఉత్సవాలు ఏకకాలంలో చేపట్టనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 9న ఉదయం తిరువేంకటపతి అలంకార సేవ, సాయంత్రం గరుడ వాహనంపై పరవాసుదేవ అలంకార సేవ.. 10న ఉదయం కాళీయమర్దన అలంకార సేవ, సాయంత్రం హనుమంత వాహనంపై శ్రీరామావతార అలంకార సేవ చేపట్టనున్నారు. ఇక చివరి రోజైన 11న నిర్వహించే పూర్ణాహుతి, నరసింహుడి జయంతి, నృసింహ అవతార ఆవిర్భావ ఘట్టంతో జయంతి ఉత్సవాలు ముగియనున్నాయి. ఇక జయంతి ఉత్సవాల సందర్భంగా 9 నుండి 11 వరకు మూడు రోజుల పాటు స్వామివారి ఆర్జిత సేవలు, నిత్య, శాశ్వత, మొక్కు కల్యాణాలు, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం పూజలను తాత్కాలికంగా రద్దు చేశారు.



### వైభవంగా లక్షపుష్పార్చన

ఏకాదశి పర్వదినం సందర్భంగా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వామివారికి లక్షపుష్పార్చన నిర్వహించారు. ప్రధానాలయ ముఖ మంటపంలో స్వర్ణపీఠంపై లక్ష్మీసమేత నారసింహుడిని అధిష్టింపజేసి ప్రత్యేకంగా తెప్పించిన పూలతో లక్షపుష్పార్చన చేపట్టారు. వేదపండితుల మంత్రోచ్ఛారణలు, పారాయణీకుల వేదపారాయణాల నడుమ అర్చకులు రకరకాల పూలతో స్వామిఅమ్మవార్లను అర్చించారు.

## తుదిశ్వాస వరకు ప్రజాసేవకే అంకితం

**ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: తుదిశ్వాస వరకూ ప్రజాసేవకే జీవితం అంకితమని ఉమ్మడి నల్గొండ జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి అన్నారు. గురువారం తన పుట్టినరోజు సందర్భంగా తన భార్య, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, కూతుళ్లతో కలిసి యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గర్భగుడిలో స్వయంభూ నారసింహుడిని దర్శించుకుని ప్రధానాలయ ముఖ మంటపంలో స్వామివారి ఉత్సవమూర్తులకుఅష్టోత్తర పూజలు చేశారు. అనంతరం కొండ కింద వైకుంఠ ద్వారం వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్ ను కట్ చేసి బర్త్ డే సంబరాలు చేసుకున్నారు. అనంతరం వైకుంఠ ద్వారం నుండి గుండ్లపల్లి వరకు పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన 31 ఏళ్ల రాజకీయ జీవితంలో ప్రజలకు సేవ చేయడానికే అధిక సమయం కేటాయించానని, ఇకముందు కూడా ఏదో రకంగా ప్రజలకు సేవ చేస్తూ అందుబాటులో ఉంటానన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజా సమస్యల పరిష్కారం కోసమే పోరాటం చేశానని, ఇకపై కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయడమే తన ధ్యేయమని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, యాదగిరిగుట్ట పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రాంరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు గడ్డమీది రవీందర్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ అనురాధ, మాజీ సర్పంచ్ బీరయ్య, యూత్ విభాగం మండల కార్యదర్శి కౌడె మహేందర్, టౌన్ అధ్యక్షుడు పాపట్ల నరహరి, మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ పలుగుల నవీన్ కుమార్, జిల్లా నాయకులు వెంకటేష్ గౌడ్, శిఖ శ్రీనివాస్ గౌడ్, మిట్ట వెంకటయ్య, మండల యూత్ ప్రధాన కార్యదర్శి పాండవుల భాస్కర్ గౌడ్, టౌన్ యూత్ అధ్యక్షుడు సతీష్, యూత్ సెక్రటరీ శారాజి రాజేష్ తదితరులు ఉన్నారు.

## పవన్ కళ్యాణ్ మీద కంప్లైంట్ చేసిన వారి మీద చర్యలు చేపట్టాలి

**శ్రీశైలం మాజీ మండల అధ్యక్షులు మాయలూరి వెంకటేశ్వర్లు.**



శ్రీశైలం, మే 8 (రోమింగ్ న్యూస్ ) : బుధవారం రోజున 1.25ని "లకు ప్రధాని నరేంద్ర మోడీ గారి నాయకత్వం లో భారత్ సైన్యంపాకిస్తాన్ ముష్కర్ల పైన సిందూర్ అనే సైనిక దాడి విజయవంతం గా పూర్తి చేశారు. అందుకు నిన్న ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ %జవీ% పవన్ కళ్యణ్ గారు భారత్ సైనికులకు భారత్ ప్రధానికిగారికి మద్దత్తు సఫోర్ట్ ధన్యవాదములు తెలుపుతూ ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రము జహీరాబాద్ లో కొందరు యువకులు పవన్ కళ్యాణ్ గారిమీద పోలీస్ స్టేషన్ లో కంప్లెంట్ ఇవ్వడం జరిగింది. ఈ విషయం లో శ్రీశైలం బీజేపీ మండలం తరుపున, కూటమి తరుపున తీవ్రంగా ఖండిస్తున్నాము. భారత దేశానికి క సైనికులకు అండగా నిలబడాలసిని సమయంలో కొందరు భారత్ దేశానికి వ్యతిరేకం గా వ్యవహరించిన యువత, జహీరాబాద్ లో కంప్లెంట్ ఇచ్చిన వారిపైన తెలంగాణ ప్రభుత్వం విచారణ చేసి చర్యలు తీసుకోవాలి అని మీడియా ద్వారా డిమాండ్ చేస్తున్నాము.

## స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా విరాళాలు





శ్రీశైలం, మే 8 (రోమింగ్ న్యూస్) : దేవస్థానానికి ఈ రోజు (08.05.2025) స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా వారు రూ.6,06,500/-లు విలువ గల విరాళాలను అందజేశారు. ఈ మేరకు స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా, శ్రీశైలంశాఖా మేనేజర్ శ్రీ భగవాన్ ఒక ఆటోను మరియు పారిశుద్ధ్య యంత్రసామాగ్రిని దేవస్థానం కార్యనిర్వ హణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావుకు అందజేశారు. దేవస్థాన పారిశుద్ధ్య విభాగంలో వినియోగించుటకుగాను వీటిని అందజేసినట్లుగా బ్యాంకు అధికారులు పేర్కొన్నారు. క్షేత్రపరిధిలో ఫాగింగు చేసేందుకుగాను రూ.3.10 లక్షలు విలువ గల ఆపి ఎక్స్ట్రా క్లాసిక్ ఆటోను, క్యూకంపార్టుమెంట్ నందు భక్తులు వేచి వుండే గదులను శుభ్రపరిచేందుకు రూ.1 లక్ష విలువగల స్క్రబ్బింగ్ అండ్ డ్రైయింగ్ మిషన్ను, చెత్తాచెదా రాలను, వ్యర్థ పదార్థాలను తొలగించేందుకు రూ.1.65 విలువగల లిట్టర్ పిక్కర్ మిషన్ను, మరియు పార్కింగ్ ప్రదేశాలనందలి మురుగునీటిని మరియు వ్యర్థ పదార్థాలను తొలగించేందుకు రూ.31,500 విలువగల వ్యాక్యూమ్ క్లీనర్లను వీరు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి శ్రీ యం. శ్రీనివాసరావు స్టేట్ బ్యాంకు అధికారులకు ధన్యవాదాలు తెలియజేశారు. బ్యాంకువారు అందజేసిన సామాగ్రిని పారిశుద్ధ్యపనులకు వినియోగించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమములో పర్యవేక్షకులు డి. రాధకృష్ణ, కె. అయ్యన్న, దేవస్థానం సిబ్బంది, ఎస్.బి.ఐ సిబ్బంది పాల్గొన్నారు.

## 11న పుంగనూరు గోమాతతో గిరిప్రదక్షిణ



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ఈ నెల 11న యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి నక్షత్రం సందర్భంగా.. స్వామివారు కొలువై ఉన్న యాదగిరిగుట్ట చుట్టూ పుంగనూరు గోమాతతో గిరిప్రదక్షిణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వెంకటరావు తెలిపారు. గురువారం యాదగిరిగుట్టలో అఖిల భారత గోసేవ ఫౌండేషన్ సభ్యులు ఈవో వెంకటరావును కలిసి వినతిపత్రం అందజేశారు. గోరక్షణ, భూరక్షణ, పర్యావరణ పరిరక్షణ, ధర్మం కోసం గతంలో అఖిల భారత గోసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు.. 182 రోజుల్లో 14 రాష్ట్రాల్లో 5158 కిలోమీటర్లు పాదయాత్ర చేసిన పుంగనూరు గోమాతతో 500 గోభక్తులు గిరిప్రదక్షిణ చేయనున్నారు. 11న ఉదయం 5 గంటలకు స్వామివారి వైకుంఠ ద్వారం వద్ద నారసింహుడి పాదాలకు ఆలయ ఈవో వెంకటరావు ప్రత్యేక పూజలు చేసి గోమాతతో గోభక్తులు చేసే గిరిప్రదక్షిణను ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తరించాలని ఈవో పేర్కొన్నారు.

### డిజిటలైజ్ కోసం ఈ-గవర్నెన్స్ కమిటీ

యాదగిరిగుట్ట నారసింహుడి దర్శనం కోసం వచ్చే భక్తులకు మెరుగైన ఆన్‌లైన్ సేవలు అందించడం కోసం త్వరలో అన్ని విభాగాల కౌంటర్లను డిజిటలైజ్(కంప్యూటరైజ్) చేయనున్నట్లు ఆలయ ఈవో వెంకటరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఆలయ ఉద్యోగులతో 'ఈ-గవర్నెన్స్' కమిటీని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దీనిద్వారా భక్తులకు మెరుగైన ఆన్‌లైన్ సేవలను అందించడమే కాకుండా ఆలయ నిర్వహణ, పరిపాలన మరింత సులభతరం అవుతుందని తెలిపారు.

## ప్రపంచ సుందరీమణుల రాక ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

**యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**యాదగిరిగుట్టపై టెంపుల్ ఈవో, డీసీపీతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్**

**15న యాదగిరిగుట్టకు రానున్న మిస్ వరల్డ్ సహా మిస్ వరల్డ్ కంటెస్టెంట్లు**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ఈ నెల 15న యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి మిస్ వరల్డ్ క్రిస్టినా పిస్జ్కోవాతో పాటు మిస్ వరల్డ్ పోటీలో పాల్గొనే ప్రపంచ సుందరీమణులు రానున్న నేపథ్యంలో.. యాదగిరిగుట్ట పట్టణం, యాదగిరికొండపైన ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సంబంధిత అధికారులను యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. ప్రపంచ సుందరీమణుల రాక సందర్భంగా కొండపైన జరుగుతున్న ఏర్పాట్లను ఎండోమెంట్ డైరెక్టర్, ఆలయ ఈవో వెంకటరావు, డీసీపీ ఆకాంక్ష్ యాదవ్ తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో క్షేత్రస్థాయిలో తిరిగి ఏర్పాట్లకు సంబంధించిన పనులను స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందాలబామల రాక ఏర్పాట్లతో స్వామివారి దర్శనానికి వచ్చే సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. యాదగిరిగుట్ట పట్టణ, ఆలయ ప్రాంతాలను సుందరీకరించాలని, విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దాలన్నారు. ప్రపంచ సుందరీమణులు పర్యటించే ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన చోట రంగులు వేసి బ్యూటిఫై చేయాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఏర్పాట్లకు సంబంధించిన పనులను నిరంతరంగా పర్యవేక్షిస్తూ.. ఏర్పాట్ల ఫొటోలు, వీడియోలు ఎప్పటికప్పుడు తనకు వాట్సాప్ చేయాలని పేర్కొన్నారు. అదేవిధంగా భద్రతకు సంబంధించి పోలీసులు మాక్ డ్రిల్ చేపట్టాలని ఆదేశించారు. యాదగిరిగుట్టపైకి వెళ్లే ఘాట్ రోడ్ల ఎంట్రీ, ఎగ్జిట్ పై ప్రధానంగా దృష్టి పెట్టాలని, ఎక్కడా చిన్న లోటుపాట్లకు తావులేకుండా భద్రతా ఏర్పాట్లను చేయాలన్నారు. ఆలయ, భద్రతా సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, సిబ్బందికి కేటాయించిన విధులపై అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రపంచ సుందరీమణుల పర్యటన సజావుగా జరిగి సక్సెస్ అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అంతకుముందు ప్రధానాలయంలో లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కృష్ణారెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో భాస్కర్ శర్మ, ఏసీపీ రమేష్ కుమార్, సీఐలు రమేష్, భాస్కర్, ఎస్పీఎఫ్ సిబ్బంది, హోంగార్డులు తదితరులు ఉన్నారు.

